సాక్షి విజయనగరం

మంగళవారం । 5 । డిసెంబర్ । 2023

న్యూస్‌రీల్

నేడు విద్యాలయాలకు సెలవు

విజయనగరం అర్బన్: మిచాంగ్ తుఫాన్ ప్రభావం దృష్ట్యా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, ఇంటర్మీడియట్ విద్యాసంస్థలకు మంగళవారం కలెక్టర్ నాగలక్ష్మి సెలవు ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత విద్యా సంస్థల జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారు. తుఫాన్ వర్షాలకు విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా సెలవు ప్రకటించినట్టు డీఈఓ బి.లింగేశ్వర రెడ్డి, ఇంటర్మీడియట్ రీజనల్ పర్యవేక్షణ అధికారి ఎం.ఆదినారాయణ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

ఆఫ్‌లైన్‌లో ధాన్యం సేకరణ


కె.మయూర్ అశోక్, జేసీ

విజయనగరం అర్బన్: రైతులు నూర్పిడిచేసిన ధాన్యంను ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఇప్పటివరకు 440 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మరో వెయ్యిమెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మంగళవారం సేకరించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 52 వేల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచామని చెప్పారు.

తుఫాన్ సహాయక చర్యలకు ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్, ఎస్పీ దీపిక

విజయనగరం అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుఫాన్ ఏపీ తీరం వైపు దూసుకువస్తున్న దృష్ట్యా ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా సహాయక చర్యలు అందించాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. తుఫాన్ సహాయక చర్యలపై తీరప్రాంత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సోమవారం సమీక్షించారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు నష్టం జరగకుండా రైతులను అప్రమత్తం చేయాలన్నారు. తుఫాన్ నష్టం త్వరగా అంచనా వేయడంలో వలంటీర్ వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, జేసీ మయూర్‌అశోక్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీపీఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

- వెదుళ్లపాలెం హైవేలో డ్రైవర్ దుర్మరణం


పైడితల్లి (ఫైల్)

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): మండలంలోని వెదుళ్లపాలెం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మరణించాడు. ఎస్‌ఐ విభీషణరావు తెలిపిన వివరాల ప్రకారం... తుని నుంచి నక్కపల్లి వైపు వస్తున్న లారీని వెదుళ్లపాలెం సమీపంలో డ్రైవర్ నిలిపి టైర్లలో గాలి పరిశీలిస్తుండగా.. వెనుకనుంచి మరో లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆగి ఉన్న లారీ డ్రైవర్ విజయనగరం జిల్లా గుర్ల మండలం పెనుబర్తి గ్రామానికి చెందిన దొప్పా పైడితల్లి(45) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు సహాయక చర్యలు చేపడుతున్న సమయంలో హైదరాబాద్ నుంచి వస్తున్న మరో ప్రైవేటు ట్రావెల్ బస్సు తన ముందున్న పాలవ్యాన్‌ను ఢీకొట్టి పక్కనే సైడు కాలువలోకి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణికులంతా ప్రాణాలతో బయటపడ్డారని ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనలపై కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శరవేగంగా ఆర్‌యూబీ నిర్మాణం


యుద్ధప్రాతిపదికన సాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి రైల్వే లెవిల్ క్రాసింగ్ (గేటు) స్థానంలో అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు సోమవారం యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్ దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. రైల్వే విద్యుత్, ఇంజినీరింగ్, ఎమర్జెన్సీ, కార్మిక విభాగాలు క్రేన్లు, జేసీబీలు, పొక్లెయిన్లతో పనులు నిర్వహించారు. పలు రైళ్లను రద్దు చేశారు. మరికొన్ని దారిమళ్లించారు. ట్రాక్‌లను వెంటవెంటనే పునరుద్ధరించారు.


చింతపల్లి తీరంలో ఫ్యూజిటెక్ వంతెన సమీపంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటాలు

మిచాంగ్ అలజడి

- ఉమ్మడి విజయనగరం జిల్లాలో చిరుజల్లులు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- తీరంలో రెడ్ అలర్ట్
- నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ దండోరా
- ముమ్మరంగా ధాన్యం కొనుగోలు


చింతపల్లి రేవులోఎర్రజెండా ఎగురవేసిన రెవెన్యూ, మత్స్య, మెరైన్ శాఖ అధికారులు

విజయనగరం అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుఫాన్ ప్రభావం ఉమ్మడి విజయనగరం జిల్లాలో కనిపించింది. సోమవారం వేకువజాము నుంచి చిరుజల్లులు కురిశాయి. రాత్రి సమయంలో కొన్నిచోట్ల మోస్తరు వర్షం కురిసింది. భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో కలెక్టర్లు నాగలక్ష్మి, నిషాంత్‌కుమార్ అధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు లోతట్టు ప్రాంతాలు, నదీతీర, సముద్రతీర గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీచేయించారు. పూసపాటిరేగ తీరంలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. చేపల వేటకు మత్స్యకారులు వెళ్లవద్దంటూ దండోరా వేయించారు. వ్యవసాయాధికారులు, సచివాలయ అసిస్టెంట్లు పొలాల్లోకి వెళ్లి కోసిన చేనును రైతులతో గాలిదిబ్బలు (చిన్నచిన్న కుప్పలు) పెట్టించారు. వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. నూర్పిడిచేసిన ధాన్యంను యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేసి మిల్లులకు తరలించారు. తుఫాన్ బాధితులకు సహాయం కోసం కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటుచేశారు.

చింతపల్లి రేవులో ప్రమాద హెచ్చరిక

పూసపాటిరేగ: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుఫాన్‌తో సముద్రం అల్లకల్లోలంగా మారింది. చింతపల్లి సముద్రతీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా తహసీల్దార్ ఇ.భాస్కరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఎర్రజెండాను ఎగురవేశారు. తీరప్రాంత గ్రామాలైన చింతపల్లి, పతివాడబర్రిపేట, తమ్మయ్యపాలెం, తిప్పలవలస, కోనాడ, పులిగెడ్డపేట గ్రామాల మత్స్యకారులు పడవులు, వలలను సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. తహసీల్దార్‌తో పాటు చింతపల్లి మెరైన్ సీఐ వైకుంఠరావు తీరంలో పర్యటించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు.

పెనుగాలులు వీచే అవకాశం


మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

జిల్లా తీరప్రాంతంలో పెనుగాలులు వీచే అవకాశం ఉంటుందని, గరిష్ఠంగా 85 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, ప్రజలు ఇళ్లలోంచి బయటకు రావద్దని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. మంగళవారం ఉదయం నుంచి గాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, గరిష్ఠంగా 95 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నారు. తుఫాన్ కారణంగా విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, అందువల్ల ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో రోడ్లు కోతకు గురికావడం, చెరువులు, కాల్వలకు గండ్లు పడి నీరు పొంగిపొర్లడం జరుగుతుందని, సంబంధిత శాఖల అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

విజయనగరం జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఇలా..

విజయనగరం కలెక్టరేట్:
08922-236947

విజయనగరం ఆర్డీఓ కార్యాలయం:
08922-276888

చీపురుపల్లి ఆర్డీఓ కార్యాలయం:
91217 35703

బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయం:
63025 54425


కళ్లికోట రేవు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఎంపీడీఓ మల్లికార్జునరావు తదితరులు

అప్రమత్తంగా ఉండండి

కొమరాడ: తుఫాన్ నేపథ్యంలో నాగావళి నదీతీర ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మల్లికార్జునరావు సూచించారు. నాగావళి నదీ తీరప్రాంతాలైన సరుగుడుగూడ జంక్షన్, పాత కళ్లికోట, పాతదుగ్గి గ్రామాలను సోమవారం పరిశీలించారు. వర్షాలకు నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, పశువులను మేతకోసం నదిని దాటించి తీసుకెళ్లరాదన్నారు. రేవుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నరేష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో కురిసిన వర్షపాతం (మిల్లీమీటర్లలో) ఇలా..

మండలం	ఆదివారం	సోమవారం
పూసపాటిరేగ	0.0	23.8
కొత్తవలస	19.4	16.2
వేపాడ	0.0	16.0
భోగాపురం	13.6	15.6
విజయనగరం	6.4	14.8
గుర్ల	0.8	14.2
గంట్యాడ	4.2	14.0
బొండపల్లి	0.0	12.8
లక్కవరపుకోట	2.4	12.8
జామి	10.2	10.4
గజపతినగరం	0.0	9.4
శంగవరపుకోట	3.2	8.6
చీపురుపల్లి	0.6	7.4
మెంటాడ	0.0	7.0
గరివిడి	0.0	6.2
రేగిడి(ఆమదాలవలస)	0.0	5.8
సంతకవిటి	0.0	5.0
రామభద్రపురం	0.0	5.0
నెల్లిమర్ల	1.8	4.4
దత్తిరాజేరు	0.0	4.4
రాజాం	0.0	4.0
మెరకముడిదాం	0.0	3.8
తెర్లాం	0.0	3.6
బొబ్బిలి	0.0	3.4
డెంకాడ	10.4	3.2
బాడంగి	0.0	2.8
వంగర	0.0	2.6


రేగిడి : చాటాయివలసలో వరి పనలను కుప్పలుగా వేస్తున్న రైతులు


జామి: అన్నంరాజుపేట గ్రామంలో జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు ఆధ్వర్యంలో రైతు కళ్లం నుంచి మిల్లులకు ధాన్యం తరలింపు

రాష్ట్రంలో 35 లక్షల ఎకరాలు పేదల సొంతం


ఎఫ్‌హెచ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

- ఇది జగనన్న అడగకుండా ఇచ్చిన సొంత ఆస్తి: పీడిక రాజన్న దొర

భామిని: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల్లోని పేదలకు 35 లక్షల ఎకరాల భూములకు హక్కులు కల్పించారని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. భామిని మండల కేంద్రంలో పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కలిసి 20 గ్రామాలకు చెందిన 1175 మందికి 987.75 ఎకరాలకు సోమవారం పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో డి-పట్టాదారులకు ఎఫ్‌హెచ్‌ఆర్ పట్టాలు ఇవ్వడం సంతోషదాయకమన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో పేద రైతులకు శాశ్వత హక్కులు కలిగాయన్నారు. ఈ పట్టాలతో బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చని, విక్రయించుకోవచ్చని, వారసులకు ఆస్తిగా ఇవ్వవచ్చన్నారు. నాలుగున్నరేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గిరిజనులకు 9 లక్షల ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు అందజేస్తే, 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు కేవలం 17వేల మందికే పోడు పట్టాలిచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల వేళ చంద్రబాబు చెప్పే మోసపూరిత హామీలు నమ్మవద్దన్నారు. గిరిజనులకు వివిధ సంక్షేమ పథకాలు అందజేస్తూ, ఆర్థికోన్నతికి పాటుపడుతున్న వ్యక్తి ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఉద్ఘాటించారు. వాస్తవాలను వక్రీకరించేవారిపై క్రిమినల్ కేసులు పెడతామని రాజన్నదొర హెచ్చరించారు.

- పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మాట్లాడుతూ భామిని మండలంలోని సమస్యలు వివరించారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం నుంచి బస్సు సౌకర్యాలు, జాతీయ బ్యాంకు ఏర్పాటు, డిగ్రీ కళాశాల ఏర్పాటు ఆవశ్యకతను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ అడగకుండానే అన్నీ ఇచ్చిన జగనన్నను గుండెల్లో పెట్టుకోవాలని పిలుపు నిచ్చారు. ఐటీడీఏ పీఓ పి.కల్పనాకుమారి ఆధ్వర్యంలో గిరిజనులకు డీకేటీ పట్టాలు అందజేశారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొవ్వాడ చిరంజీవులు, పార్టీ అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, జేసీఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, ఎంపీటీసీలు టింగ అన్నాజీరావు, బిడ్డిక తులసి, పాలక ఉషారాణి, కో ఆప్షన్ సభ్యులు విశ్వనాథ పట్నాయక్, తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఎంపీడీఓ ఉమామహేశ్వరి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తం

- తుఫాన్ షెల్టర్స్, హాస్పిటల్స్‌కు అంతరాయం కలగకూడదు
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆదేశం
- 5 సర్కిళ్లలో కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు

సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల కలిగే విద్యుత్ ప్రమాదాలు, అంతరాయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సంస్థ డైరెక్టర్లు, 5 సర్కిళ్ల అధికారులకు అవసరమైన సూచనల్ని సీఎండీ చేశారు. ప్రమాదాలు, అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912కి తెలియజేయాలన్నారు. తుపాను సహాయక కేంద్రాలకు, హాస్పిటల్స్‌కు తప్పనిసరిగా విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్ల ఎస్‌ఈలను ఆదేశించారు. తుపాను ప్రభావానికి తెగిపడే విద్యుత్ వైర్లను, విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను అందుబాటులో ఉంచాలని ఎస్‌ఈలకు సూచించారు. వినియోగదారుల నుంచి వచ్చే విద్యుత్ అంతరాయాల ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేసుకునేందుకు ఐదు జిల్లాల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు సీఎండీ తెలిపారు. సమాచారాన్ని టోల్ ఫ్రీ నెం. 1912, వాట్సాప్ నెంబర్ 8500001912, విజయనగరం కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్‌కు-94906 10102 తెలియజేయాలన్నారు.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణం


కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ వారం 1155 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలన్నది లక్ష్యమని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. తుఫాన్ జాగ్రత్తలు, ఇళ్ల నిర్మాణం, ప్రాధాన్యతా భవనాల నిర్మాణం, ఆడు దాం ఆంధ్రా, గడపగడపకు మన ప్రభుత్వం, ఆయుష్మాన్ భారత్ వంటి అంశాలపై మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం సమీక్షించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ కింద అందిన క్లెయిమ్స్ అభ్యంతరాలను ఈ నెల 7లోగా డిస్పోజ్ చేయాలని సూచించారు. జేసీ మయూర్ అశోక్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ప్రతి సచివాలయం నుంచి 228 ఆటగాళ్ల పేర్లు నమోదు చేయాలని, వారిలో సగంమంది మహిళలు ఉండాలన్నారు.

విదేశీ విద్యాదీవెన పథకాన్ని అమలు చేయండి



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: దేశ వ్యాప్తంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులు విదేశీవిద్యను అభ్యసించేలా కేంద్ర ప్రభుత్వం విదేశీ విద్యాదీవెన పథకాన్ని ప్రవేశపెట్టాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. జాతీయ స్థాయిలో విదేశీ విద్య పథకం అమలుకోసం ఢిల్లీలో జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ సోమవారం మాట్లాడారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు సహాయం చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో గొప్ప మనస్సుతో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా ప్రపంచంలోని అగ్రశ్రేణిలో ఉన్న 100 విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు. విదేశీ విద్యకు కనీసం రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చు అవుతున్న నేపథ్యంలో విదేశీ విద్య కోసం జాతీయ స్థాయిలో నిధిని ఏర్పాటుచేయడం అవసరమన్నారు.

పంపిణీకి 'ఆడుదాం ఆంధ్రా' కిట్లు

రాజాం: ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరం ఈ నెల 15న ఆరంభం కానుంది. ఇందులో భాగంగా క్రీడా కిట్లను ప్రభుత్వం సరఫరా చేసింది. జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాలకు కిట్లు చేరాయి. వీటిని రెండురోజుల్లో సచివాలయాల వారీగా పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


రాజాం మండలపరిషత్ కార్యాలయంలో సిద్ధంగా ఉన్న ఆడుదాం ఆంధ్రా కిట్లు

సంగమేశ్వరుని సేవలో స్పీకర్ దంపతులు


సంగమేశ్వర సన్నిధిలో అభిషేకం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు

వంగర: పవిత్ర పుణ్యక్షేత్రం సంగాంలో వెలసిన సంగమేశ్వర స్వామివారిని ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, వాణి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదాశీస్సులు, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ద్వాపర యుగంలో బలరాముడు ప్రతిష్ఠించిన శివలింగం ఇక్కడ నెలకొని ఉండడం గొప్ప విశేషం అన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానన్నారు. ఆయన వెంట సర్పంచ్ గేదెల వెంకటనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు గేదెల పారమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు గేదెల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం ఐసీడీఎస్ పరిధిలో ఏడు అంగన్వాడీ కార్యకర్తలు, 19 సహాయకులు, 8 మినీ అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ ఎంఎన్ రాణి సోమవారం తెలిపారు. పార్వతీపురం డివిజన్‌లోని కొమరాడ ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్వాడీ కార్యకర్త, ఐదు సహాయకులు, ఒక మినీ అంగన్వాడీ పోస్టుకోసం దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే పార్వతీపురం ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్వాడీ కార్యకర్త, రెండు అంగన్వాడీ సహాయకులు, ఒక మినీ అంగన్వాడీ పోస్టులు, పాచిపెంట ప్రాజెక్టు పరిధిలో మూడు అంగన్వాడీ కార్యకర్త, ఆరు అంగన్వాడీ సహాయకులు, నాలుగు మినీ అంగన్వాడీ పోస్టులు, సాలూరు ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టు, ఒక మినీ అంగన్వాడీ పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. పాలకొండ డివిజన్‌లోని కురుపాం ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్వాడీ కార్యకర్తలు, నాలుగు అంగన్వాడీ సహాయక పోస్టులు, ఒక మినీ అంగన్వాడీ పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 21 నుంచి 35ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు ఈనెల 6 నుంచి 14వ తేదీ సాయంత్రం లోగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు బ్యాక్‌లాగ్ పోస్టులు

- నలుగురికి నియామక ఉత్తర్వులు




నియామక ఆదేశ పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన బ్యాక్‌లాగ్ ఉద్యోగ నియామకాలలో భాగంగా పోస్టుల నియామక పత్రాలను కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం కలెక్టరేట్‌లో అందజేశారు. జిల్లా యంత్రాంగం మార్చి–2023లో ప్రకటించిన నోటిఫికేషన్ ఆధారంగా జరిపిన నియామకాలో వివిధ కేటగిరిల్లో నాలుగు పోస్టులను భర్తీ చేశారు. వాటిలో గ్రూప్–4 కేటగిరి జూనియర్ అసిస్టెంట్ పోస్టులు (ఒ.హెచ్.–జనరల్)–2, క్లాస్–4 కేటగిరి పోస్టు నైట్ వాచ్‌మన్ (హెచ్.హెచ్.–జనరల్)–1, దోబీ/చెక్లర్/స్వీపర్ (హెచ్.హెచ్.–జనరల్) కేటగిరి పోస్టు–1 ఉన్నాయి. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఎ.డి జీవీబీజగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన ఐదు మోటార్ సైకిల్స్ స్వాధీనం

విజయనగరం క్రైమ్: జిల్లాలో చోరీకి గురైన ఐదు మోటార్ సైకిల్స్ స్వాధీనం చేసుకున్నామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న బైక్‌లను పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయనగరం వన్‌టౌన్, రూరల్, జామి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చోరీకి గురైన ఐదు మోటార్‌సైకిల్స్‌ను రికవరీ చేశామన్నారు. ఈ కేసులో మైనర్‌ను అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టగా అందిన సమాచారం మేరకు విజయనగరం పట్టణంలో చోరీకి గురైన మూడు మోటార్‌సైకిల్స్, జామి స్టేషన్ పరిధిలో చోరీకి గురైన ఒక మోటార్ సైకిల్, విజయనగరం రూరల్ పీఎస్ పరిధిలో చోరీకి గురైన మరో మోటార్ సైకిల్‌ను రికవరీ చేశామని తెలిపారు. మోటార్ సైకిల్స్‌ను రికవరీ చేయడంలో క్రియాశీలకంగా పనిచేసిన సిబ్బందిని అభినందించారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీఐజీ



సిబ్బందికి సూచనలిస్తున్న డీఐజీ హరికృష్ణ

భోగాపురం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ సోమవారం సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలు గతం కన్నా బాగా తగ్గుముఖం పట్టాయన్నారు. అలాగే ఈప్రాంతంలో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తుండడంతో కేసులు కూడా తగ్గుముఖం పట్టాయని సంతృప్తి వెలిబుచ్చారు. సైబర్ క్రైమ్, సముద్రపు నల్ల ఇసుక అక్రమ తరలింపు, గంజాయికి సంబంధించిన వాటిపై విలేకరులు అడగగా ప్రజలు సమాచారం అందిస్తే నివారించడానికి చేయడానికి అవకాశం ఉంటుందని, ఎక్కడైనా అలాంటి విషయాలు మీ దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం క్రైమ్‌లు, తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై పోలీసు సిబ్బందితో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్పీ ఎం.దీపిక, డీఎస్పీ గోవిందరావు, సీఐ వీవీ వెంకటేశ్వరరావు, ఎస్సైలు ఎస్.కృష్ణమూర్తి, యు.మహేశ్, సూర్యకుమారి, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹80	₹130	₹140

ఎంతమంది కలిసినా ఏం లాభం?

- సీఎంగా మళ్లీ గెలిచేది జగన్‌మోహన్ రెడ్డే
- డిప్యూటీ సీఎం రాజన్నదొర

పాలకొండ: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని పార్టీలు పొత్తు పెట్టుకున్నా? ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహనరెడ్డి గెలుస్తారని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖా మాత్యులు పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు సోమవారం అయన పాలకొండ పట్టణంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం నివాస గృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్న తీరుపై ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందని, దానిని చూడలేని ప్రతిపక్ష టీడీపీ, దానికి వత్తాసు పలికే పార్టీలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని ఆరోపించారు. అధికారంలో ఉండగా ప్రజలను మోసగించిన చంద్రబాబు ఇప్పుడు మరోమారు ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇందుకు వారి అనుకూల మీడియాను అడ్డుపెట్టుకుంటున్నారన్నారు.

ఆదర్శంగా రాష్ట్రంలోని పథకాలు

అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ఇచ్చిన హమీలు 95శాతం పూర్తి చేసిన ముఖ్యమంత్రి జగన్‌కు, అధికారంలో ఉండగా చెప్పుకునేందుకు ఒక మంచి పథకం కూడా అమలు చేయని చంద్రబాబుకు ఎంతో తేడా ఉందని వివరించారు. విద్య, వైద్యం, సంక్షేమ అన్నింటా నూతన ఒరవడిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని, ప్రజలకు పాలన చేరువ చేసిందని చెప్పారు. రాష్ట్రంలో జగన్ ప్రవేశ పెట్టిన పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయన్నారు.

రాష్ట్రంలో ప్రజల రాజ్యం

తెలంగాణలో కుటుంబ పాలన కారణంగానే బీఆర్ఎస్ ఓడిపోయిందని, దొరల రాజ్యం అక్కడ ఉండేదని, ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల రాజ్యం ఉందని పేర్కొన్నారు. మూడు రాజధానులను ఒక సామాజిక వర్గం మాత్రమే వ్యతిరేకిస్తోంది తప్ప ప్రజల నుంచి మద్దతు ఉందన్నారు.

తెలంగాణలో పవన్ తుస్..

పవన్ కల్యాణ్ పార్టీ తెలంగాణలో తేలిపోయిందని, 80శాతం ఆంధ్రులు ఉన్న కూకటపల్లిలో జనసేన పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆంధ్రలో టీడీపీ, జనసేన పొత్తుతో తమకు కలిగే నష్టం ఏమీ లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అభివృద్ధిపై మాట్లాడుతున్న ప్రతిపక్షాలు వారు అధికారంలో ఉండగా ఏం చేశారని ప్రశ్నించారు. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం, ఇతర నాయకులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రాజన్నదొర, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

బత్తిలి పోలీస్ స్టేషన్ ప్రారంభం

భామిని: మండలంలోని బత్తిలిలో నూతనంగా నిర్మించిన మోడల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని డిప్యూటీ ముఖ్యమంత్రి,గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్,డీఎస్పీ కేవీ కృష్ణారావులు నూతన భవనంలోని నిర్మాణాలు, గదులను డిప్యూటీ సీఎం రాజన్నదొరకు చూపించి వివరించారు. ముందుగా సాయుధ దళాలు డిప్యూటీ సీఎంకు పోలీస్ వందనం సమర్పించాయి. కార్యక్రమంలో పాలకొండ శాసన సభ్యురాలు విశ్వాసరాయి కళావతి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బాబు, సీఐ కె.మురళీధర్, ఎస్సై యతిరాజుల అమ్మానరావు, బత్తిలి సర్పంచ్ టింగ శాంతికుమారి, ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, కోఆప్షన్ సభ్యుడు విశ్వనాథ పట్నాయక్, ఉపసర్పంచ్ వమ్మరవిల్లి రమేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మజ్జి మోహనబాబు, బోదెపు శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మోడల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, చిత్రంలో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్‌బాబు, డీఐజీ హరికృష్ణ, ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఆడుదాం.. ఆంధ్ర రిజిస్ట్రేషన్లలో టాప్

- ప్రథమస్థానంలో రామభద్రపురం మండలం

రామభద్రపురం: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఆడుదాం ..ఆంధ్ర అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది.ఈ పోటీలకు సచివాలయాలలో క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం వరకు రామభద్రపురం మండలంలో 1250 రిజిస్ట్రేషన్లు నమోదై జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉంది. బొబ్బిలి 935 రిజిష్టరేషన్లతో ద్వితీయ స్థానం, 795తో గుర్ల తృతీయ స్థానంలో ఉన్నాయి. జిల్లాలో 17,648 మంది క్రీడాకారులు వివిధ రకాల క్రీడలు ఆడేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోగా అందులో పురుషులు 16,431, స్త్రీలు 1217 మంది ఉన్నారు. అలాగే మండలంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న 1,250 మందిలో పురుషులు 996 మంది, స్త్రీలు 254 మంది ఉన్నారు. అందులో క్రికెట్ ఆడేందుకు 747 మంది పురుషులు, 28 మంది స్త్రీలు రిజిస్ట్రేషన్ చేసుకోగా బ్యాడ్మింటన్ ఆడేందుకు పురుషులు 109 మంది, 24 మంది స్త్రీలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వాలీబాల్ ఆడేందుకు 232 మంది పురుషులు, 10 మంది స్త్రీలు, కబడ్డీ ఆడేందుకు 211 మంది పురుషులు, 78 మంది స్త్రీలు, ఖోఖో క్రీడకు 110 మంది స్త్రీలు, 76 మంది పురుషులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.ఈ నెల 15 వ తేదీ నుంచి గ్రామ సచివాలయ స్థాయిలో ఈ పోటీలు పక్కాగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో ప్రతిభ కనబరిచిన విజేతలకు రూ.35 వేలు, ద్వితీయ స్థానానికి రూ.15 వేలు, తృతీయ స్థానానికి రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులను ప్రభుత్వం ఇవ్వనుంది. అలాగే జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి రూ.60 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు అందించనున్నారని ఎంపీడీవో రమామణి తెలిపారు. ఆసక్తి గల యువతీయువకులు త్వరగా వారి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.



సచివాలయాలకు చేరిన క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీడీవో రమామణి

శౌర్యానికి మారుపేరు భారత రక్షణరంగం



నేవీ డే వేడుకల్లో పాల్గొన్న సైనిక పాఠశాల అధికారులు, విద్యార్థులు

- కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్‌కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి
- పాఠశాలలో ఘనంగా నావికా దినోత్సవం

విజయనగరం రూరల్: శౌర్యానికి మారుపేరు భారత రక్షణ రంగమని కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి పేర్కొన్నారు. భారత నావికా దళ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరుకొండ సైనిక పాఠశాలలో నావికా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కోరుకొండ సైనిక పాఠశాల విద్యార్థులు దేశ రక్షణ రంగంలో చేరి దేశ రక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారత రక్షణ రంగంలో నావికా దళం కీలక భూమిక పోషిస్తుందని చెప్పారు. నావికాదళం దేశరక్షణలో వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. అమరవీరులు, యుద్ధవీరుల సాహసాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో కేక్ కట్ చేసి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకరికొకరు అభినందనలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి, తదితరులు

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గజపతినగరం: గజపతినగరం జాతీయ రహదారి వద్ద ఈనెల 2వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన వృద్ధుడు దాడి అప్పలనాయుడు(65) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గజపతినగరం ఏఎస్సై మాతా మూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెంటాడ మండలం కొంపంగి గ్రామానికి చెందిన దాడి అప్పలనాయుడిని గజపతినగరం జాతీయ రహదారి వద్ద ఆటో ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో విజయనగరంలోని సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

అత్యవసరమైతేనే బయటకు రండి

- తుఫాన్ దృష్ట్యా కలెక్టర్ విజ్ఞప్తి
- నేడు పాఠశాలలకు సెలవు



మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: మిచాంగ్ తుఫాన్ తీవ్రత దృష్ట్యా మంగళ, బుధవారాలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుఫాన్ తీవ్రత దృష్ట్యా జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. తుఫాన్ తీవ్రత ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు. జిల్లాలో మనుషులు, జంతువుల ప్రాణనష్టం, పంటనష్టం జరగకుండా ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. మిచాంగ్ తుఫాను ఏర్పాట్లపై సోమవారం ఆయన కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1.70 లక్షల ఎకరాలలో పంట వేశారని, 4,200 మెట్రిక్ టన్నుల వరకు నూర్పులు జరిగాయన్నారు. 629 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద సురక్షితంగా ఉందని, మిగిలిన మొత్తం ధాన్యం యుద్ధ ప్రాతిపదికన మిల్లులకు తరలించామని చెప్పారు. ధాన్యం, ఇతర పంటలు ఎక్కడ ఉన్నా వ్యవసాయ సహాయకులకు సమాచారం అందించాలని కోరారు. తుఫాన్ పట్ల రైతు భరోసా కేంద్రాలలో రెండు దఫాలుగా అవగాహన సమావేశాలు నిర్వహించామని పేర్కొన్నారు. పంట కోతకోయకుండా ఉంటే అలానే ఉంచాలని సూచించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా అన్ని నీటి పథకాలను పూర్తి సామర్థ్యంతో నింపి, ప్రజలకు రెండు రోజులకు సరిపడా నీటిని నిల్వ ఉంచాలని సూచించారు. తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా గ్రామీణ నీటి సరఫరా విభాగం 79 జనరేటర్లు సిద్ధంగా పెట్టినట్లు తెలిపారు.

విపత్తుల నివారణ బృందాలు సిద్ధం

రహదారులపై చెట్లు, స్తంభాలు కూలితే తక్షణం తొలగించేందుకు జిల్లా విపత్తులు, స్పందన శాఖ నుంచి 13 బృందాలు, రహదారులు, భవనల శాఖ నుంచి 15 బృందాలు సిద్ధం చేశామని కలెక్టర్ చెప్పారు. చెరువులు, నదులలో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించేందుకు బోటు రెస్క్యూ ఆపరేషన్ బృందం ఉందన్నారు. జిల్లాలో ఉన్న 39 పెట్రోల్ బంకులు పూర్తి సామర్థ్యంతో ఉండాలని, మొబైల్ సేవలకు అంతరాయం కలగకుండా పవర్ బ్యాక్ అప్ నిర్వహించాలని మొబైల్ ఆపరేటర్లను ఆదేశించినట్లు తెలిపారు.

అదనపు పడకలు ఏర్పాట్లు

అన్ని ఆస్పత్రుల్లో అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా జనరేటర్లు ఇతర బ్యాక్‌అప్ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. 86 మంది గర్భిణులను ఇప్పటికే ఆస్పత్రులకు తరలించామని చెప్పారు. సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రిలో అదనపు పడకలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. గత అనుభవాల దృష్ట్యా ప్రమాదం సంభవించే ఆస్కారం ఉన్న 78 నదీ పరీవాహక గ్రామాలు, కొండశిఖర గ్రామాలను గుర్తించి వాటికి 79 పునరావాస కేంద్రాలను గుర్తించి సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో గల 578 చౌక ధరల దుకాణాలు, 8 ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద సరుకులు పూర్తిస్థాయిలో ఉన్నాయని, పునరావాస కేంద్రాల వద్ద వంట ఏజెన్సీల ద్వారా ఆహార పదార్థాల తయారీకి సిద్ధం చేశామని తెలిపారు. మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపీడీఓ, ఎస్ఐలు సమన్వయంతో పనిచేయాలని, పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు చెప్పారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో లోతట్టు ప్రాంతాలలోవున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20ఏళ్ల జైలు



ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: పోక్సో కేసులో నేరం రుజువైనందున ముద్దాయికి 20ఏళ్ల జైలుశిక్షను విధిస్తూ విజయనగరం పోక్సో స్పెషల్ కోర్టు తీర్పు వెలువరించిందని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలోని విజయరామరాజు కాలనీలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున విద్యార్థిని వెంటపడిన పట్టణానికి చెందిన బొత్స కామేష్ గత ఏడాదిలో సెప్టెంబర్ నెల 15 తేదీన బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి అంగీకరించకపోతే చనిపోతానని బెదిరించాడు. దీంతో ఆ బాలిక భయపడి కామేష్‌తో పరిచయం పెంచుకుంది. దీన్ని ఆసరాగా తీసుకుని కామేష్ బాలికపై లైంగికదాడి చేసిన కారణంగా బాధితురాలు గర్భం దాల్చింది. ఈ విషయాన్ని కామేష్‌కు తెలియజేసి పెళ్లి చేసుకోమని అడగ్గా అందుకు నిరాకరించి మందులతో గర్భాన్ని తొలగించుకో అని చెప్పి తిరస్కరించాడు. దీంతో బాధిత బాలిక తల్లి పార్వతీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ ఎ. సుభాష్, దిశ సెల్ డీఎస్పీ ఎస్ఆర్ హర్షితలు విచారణ చేపట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం .శంకరరావు ఫిర్యాదు తరపున వాదనలు వినిపించారు. ఈ కేసులో వాదోపవాదాల అనంతరం స్పెషల్ జడ్జి కె. నాగమణి ముద్దాయిని ఖరారు చేసి కఠినకారాగార శిక్షతో పాటు రూ. 4వేలు జరిమానా విధించారు. అలాగే బాధితురాలికి రూ. రూ.5లక్షల నష్టపరిహారం మంజూరు చేశారని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ చెప్పారు.

షాప్ దగ్ధం

విజయనగరం క్రైమ్: స్థానిక మూడులాంతర్లు జంక్షన్ వద్ద ఉన్న పాన్‌షాప్, టీషాప్ పక్కన గల విద్యుత్ పోల్స్‌నుంచి షార్ట్ సర్క్యూట్ కావడంతో సోమవారం రాత్రి మంటలు చెలరేగాయి. ఈ మంటలకు షాపుపై భాగం కాలిపోయింది. ఈ విషయం గమనించిన స్థానికులు స్పందించి మంటలను అదుపుచేశారు. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి పూర్తిగా మంటలను ఆర్పివేశారు. ఎవరికీ అదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం సంభవించలేదని అధికారులు స్పష్టం చేశారు.

సమస్యలకు సంతృప్తికర పరిష్కారం



వినతులను స్వీకరిస్తున్న జేసీ గోవిందరావు



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్ఓ అనిత



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలకు అధికారులు సంతృప్తికర పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టరు ఆర్. గోవిందరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ కేశవ నాయుడుతో కలిసి ప్రజల నుంచి 120 వినతులు స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల గురించి సంబంధిత జిల్లా, మండల అధికారులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. అర్జీలపై సకాలంలో స్పందించి, చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాథరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా రవాణాశాఖాధికారి మల్లికార్జునరెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి శివప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 137 వినతులు

విజయనగరం అర్బన్: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారిణి ఎస్‌డీఅనిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారిణి ఎస్‌డీఅనితతోపాటు డిప్యూటీ కలెక్టర్‌లు బి.సుదర్శన దొర, కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సుమబాల తదితరులు 137 వినతులు స్వీకరించి వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖ జిల్లా అధికారులకు పంపించారు. ఆయా శాఖలను అందిన వినతులను సకాలంలో అర్జీదారుల సంతృప్తి మేరకు పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఆదేశించారు.

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారులకు తక్షణమే న్యాయం చేయాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆమె స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 33 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, బాధితులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ట్రైయినీ డీఎస్పీ ఎస్.మహేంద్ర, ఎస్బీ సీఐ ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.